

వనపర్తి జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నిర్వహించిన రైతు నిరసన సదస్సులో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, రావుల చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, బీఆర్‌ఎస్ నేతలు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, రజినీసాయిచంద్ తదితరులు

# పోరాడుదాం.. పొగబెడుదాం

> మొదటిపేజీ తరువాయి...

సూచించారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు నిరసన సదస్సుకు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పది వేల మంది స్వచ్ఛందంగా రైతు నిరసన సదస్సుకు తరలిరావడం చూస్తుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మీద రైతులు ఎంత ఆగ్రహంగా ఉన్నారనేది స్పష్టమవుతున్నదని చెప్పారు. 'బతుకమ్మ చీరలు లేవు.. కేసీఆర్ కిట్లు లేవు.. చెరువుల్లో చేప పిల్లలు లేవు' అంటూ నిప్పులు చెరిగారు. వరంగల్ డిక్లరేషన్‌ను ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ అతిరథులతో హామీలు ఇప్పించి ఒక్కటైనా అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. 'తెలంగాణ అంటేనే పోరాటాల గడ్డ.. చంద్రబాబు, వైఎస్ మీద పోరాటం చేసినం' అని గుర్తుచేశారు.రుణమాఫీ పేరుతో రైతులను రేవంత్ పచ్చి మోసం చేశారని మండిపడ్డారు. మ్యానిఫెస్టోలో చెప్పినవి పది నెలలైనా అమలు చేయలేదని అడిగితే బేగం బజార్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు.



మాజీ మంత్రి హరీశ్‌రావుకు వరికంకులతో స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

> **2023 డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తా అన్నడు.. పార్లమెంట్ ఎన్నికల్లో పంద్రాగస్టు అని చెప్పి మాట తప్పిండు. ఈయన చెప్తే నమ్మరని దేవుళ్ల మీద ఒట్టేసిండు. కురుమూర్తి, జోగుళాంబ, లక్ష్మీ నరసింహ స్వామి మీద ఒట్టేసి మాట తప్పిండు. మొదట 45 వేల కోట్లన్నడు. తర్వాత 29 వేల కోట్లన్నడు. చివరికి 17 వేల కోట్లు రుణమాఫీ చేసినట్టు ప్రచారం చేసి చేతులు దులుపుకొన్నడు. సగం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలే.**
> **- హరీశ్‌రావు**

### ఒక్క రైతు ముఖంలోనూ సంతోషం లేదు

కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క రైతు ముఖంలోనూ సంతోషం లేదని హరీశ్ ఆవేదన వ్యక్తంచేశారు. అసంపూర్తి రుణమాఫీ,రైతుబంధును బంద్ చేయడం.. ధాన్యానికి రూ.500 బోనస్ అని చెప్పి.. సన్నాలకే అంటూ బోగస్ చేయడంతో రైతులు నిరాశ, నిస్పృహల్లో ఉన్నారని చెప్పారు. కరోనా కాలంలోనూ రైతుబంధు అందించి అన్నదాతలను కేసీఆర్ ప్రభుత్వం ఆదుకున్నదని గుర్తుచేశారు.రాష్ట్ర వ్యాప్తంగా 11 విడతల్లో రూ.72,800 కోట్లను రైతుల ఖాతాల్లో రైతుబంధు పథకం ద్వారా జమ చేసినట్టు చెప్పారు. 'రుణమాఫీ అమలు చేస్తామని డెడ్‌లైన్ పెట్టారు.. కానీ పేపర్లలో హెడ్‌లైన్లు మారాయి.. రుణమాఫీ మాత్రం లైన్‌కు రాలేదు' అని ఘాటుగా విమర్శించారు. సాగునీరు, కరెంట్, ఎరువులకు ఎలాంటి కష్టాలు లేకుండా రైతులకు బీఆర్‌ఎస్ సర్కారు 9 ఏండ్లపాటు అండగా నిలిచిందని తెలిపారు. నేడు ఎక్కడ చూసినా కరెంట్ సమస్యలు ఉన్నాయని, లోవోల్టేజీ సమస్యతో రైతులంతా విలవిలలాడుతున్నారని ఆవేదన చెందారు.రూ.లక్షా 50 వేల కోట్లతో మూసీ సుందరీకరణ అంటూ ఢిల్లీకి మూటలు పంపేందుకు ప్రాధాన్యతనిస్తున్నారని ధ్వజమెత్తారు. జీవో 29ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థులపై పోలీసులతో లాఠీలు ఝళిపిస్తూ అశోక్‌నగర్‌ను విద్యార్థుల శోకనగరంగా మార్చారని నిప్పులు చెరిగారు.17 వేల మంది స్పెషల్ పోలీసులపై నమ్మకం లేకుండా వ్యవహరించడంతో పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం ఫెయిల్ అయ్యిందన్నారు. రైతులు, ప్రజలంతా పోరాటాలతోనే హామీలను అమలు చేయించుకోవాలని, వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ మెడలు వంచి ఇచ్చిన వాగ్దానాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు. ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నిస్తున్న తనపై రెండు, మూడు పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టారని, బీఆర్‌ఎస్ కార్యకర్తలను బెదిరిస్తూ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి కేసులపై పోరాడేందుకు ప్రత్యేక విభాగాన్ని తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ ఏర్పాటు చేసిందని తెలిపారు. నాడు

> **పాలకుడు దేవుళ్ల మీద ఒట్లు పెట్టి మాట తప్పితే రాష్ట్రానికి అరిష్టం. అందుకే నేను దేవుడి దగ్గరకి వెళ్లి ప్రజలను కాపాడు.. పాపాత్ముడిని క్షమించు అని వేడుకున్న. దానికి కూడా నా మీద కేసులు పెట్టిండ్రు.**
> **-హరీశ్‌రావు**

వనపర్తి వలసలకు కేరాఫ్‌గా ఉంటే కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక వరికోతల వనపర్తిగా మార్చామని గుర్తుచేశారు. బుద్ధారం బ్రాంచ్ కెనాల్, ఘణపురం కాల్వను తవ్వించామని, ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్ కాలేజీలు తీసుకొచ్చి వనపర్తిని సరస్వతి నిలయంగా మార్చామని చెప్పారు. రేవంత్ సర్కారు వచ్చాక పది నెలలల్లో వనపర్తిలో పైసా పని అయ్యిందా? అని ప్రశ్నించారు. 'అన్ని వర్గాలను రోడ్ల మీదికి తెచ్చిండు.. జీవో 29 తెచ్చి ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగాలు రాకుండా చేస్తున్నడు.. అన్యాయం అంటే పిల్లల వీపులు పగుల కొడుతున్నడు.. ప్రజాపాలన అన్నడు.. అర్ధరాత్రి విద్యార్థులను గొడ్లను కొట్టినట్టు కొట్టిస్తున్నడు. పోలీసోళ్లను నమ్మడం లేదు.. స్పెషల్ పోలీసులను తొలగించి ఆత్మవిశ్వాసం మీద దెబ్బకొట్టిండు. ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు ఇస్తలేదు.. ప్రజా సమస్యల పరిష్కారంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫెయిల్ అయ్యాడు' అంటూ నిప్పులు చెరిగారు. మహాలక్ష్మి కింద మహిళలకు రూ.2,500, ఆటో డ్రైవర్లకు, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన లీగల్ సెల్ ద్వారా 480 మందికి స్టే తీసుకొచ్చామని, ఇండ్లు కూలగొట్టకుండా అండగా ఉంటామని చెప్పారు. అతి చేస్తున్న పోలీసుల పేర్లు డెయిరీలో రాస్తున్నామని చెప్పారు. 'కరెంట్ బిల్లులు పెంచవద్దని బీఆర్‌ఎస్ కొట్లాడితే పెంచలేదు.. ఇది బీఆర్‌ఎస్ పోరాటం వల్లే సాధ్యమైంది' అని చెప్పారు.

### గందరగోళం చేస్తే రణరంగమే: నిరంజన్‌రెడ్డి

**రైతులు,** ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌ను స్థానిక సంస్థల ఎన్నికల్లో బొందపెట్టాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పాలమూరు బిడ్డ రాష్ట్రానికి సీఎంగా ఉన్నా ఉమ్మడి జిల్లాకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. గతంలో పాలమూరు ఎంపీగా ఉన్న సమయంలో కేసీఆర్ తెలంగాణను సాధించారని గుర్తుచేశారు. కొత్త కార్యాలయాలు నిర్మించే దశలో అక్కడి భూముల్లో కొందరు పేద రైతులుంటే వాళ్లకు నచ్చచెప్పి కొన్ని ప్లాట్లు ఇచ్చామని, ఆ ప్లాట్ల విషయంలో కొందరు నాయకులు గందరగోళపరిచే పనిచేస్తున్నట్టు తెలుస్తున్నదని, అదే జరిగితే రణరంగమేనని హెచ్చరించారు. అవసరమైతే అదే రైతులకు ప్రభుత్వం నుంచి ఎన్‌వోసీ తెచ్చి తోడ్పాటునందించాలని డిమాండ్ చేశారు. పక్క నియోజకవర్గంలో ఉన్న మంత్రి ఇక్కడ తాము తెచ్చిన కళాశాలలు, ఇతర కార్యాలయాల్లో ఆయన ఊరికి చెందిన వారిని నియమిస్తుంటే, ఇక్కడున్న అధికార పార్టీ నాయకులు ఏం చేస్తున్నారని నిలదీశారు. అన్ని విషయాలూ తెలిసిన చిన్నారెడ్డి ఎందుకు మౌనంగా ఉంటున్నారో అర్థం కావడం లేదన్నారు.

### గూండాగిరి నడువదు: ఆర్‌ఎస్ ప్రవీణ్

**పోలీసు** కుటుంబాలను పోలీసులతోనే కొట్టించడంతోపాటు వారిపై కేసులు పెట్టించడం దుర్మార్గ చర్య అని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. తెలంగాణలో గూండాగిరి నడుస్తున్నదని, ఇది ఎక్కువ రోజులు కొనసాగదని హెచ్చరించారు. స్వయంగా స్పీకర్ నోటి నుంచే గాంధీ దవాఖానకు వెళ్తే చనిపోతారనే మాటలు వస్తున్నాయంటే.. కాంగ్రెస్ పాలన ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చునన్నారు. విద్యార్థులకు రేవంత్‌రెడ్డి ఎన్నో హామీలిచ్చారని, వాటిలో ఒక్కటీ అమలు చేయలేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో గురుకులాలకు అద్దె చెల్లించడం లేదని వాటి యజమానులు తాళాలు వేసే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ పాలనలో వెయ్యికిపైగా గురుకులాలు ఏర్పాటు చేసి నెయ్యితో భోజనం పెట్టి గడువుకు ముందే అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించారని గుర్తుచేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి ప్రసంగించారు. నిరసన సదస్సులో ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, నవీన్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, గిడ్డంగుల సంస్థ మాజీ చైర్‌పర్సన్ రజనీ సాయిచంద్, బీఆర్‌ఎస్ నాయకులు అభిలాష్‌రావు, ఇంతియాజ్ ఇసాక్, శ్రీనివాస్ యాదవ్, బీఆర్‌ఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, నాయకులు, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

### అన్యాయాలను ప్రశ్నిస్తే కేసులు: శ్రీనివాస్‌గౌడ్

**ప్రభుత్వం** చేస్తున్న అన్యాయాలపై ప్రశ్నించినా.. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా కేసులు పెడుతున్నారని, అక్రమ కేసులకు భయపడేది లేదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టంచేశారు. పాలమూరులో పేదల ఇండ్లను కూల్చివేశారని, దీనిపై ప్రశ్నిస్తే కేసులు పెట్టి జైలుకు పంపించారని వాపోయారు. కొందరు పోలీసుల వ్యవహారశైలితో అందరికీ చెడ్డపేరు వస్తున్నదని చెప్పారు. మోసపోతే గోసపడుతామని కేసీఆర్ ముందే చెప్పారని, చివరికి అదే జరిగిందని వాపోయారు. ఇకపై పోరాటం తప్ప మరోటి లేదని తేల్చిచెప్పారు. నాడు 50 ఎకరాలున్న రైతులు సైతం వలసలు పోయారని, కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక సస్యశ్యామలం చేసుకున్నామని గుర్తుచేశారు.



వనపర్తిలో రైతు నిరసన సదస్సుకు స్వచ్ఛందంగా తరలివచ్చిన రైతులు

## కుటుంబ సర్వేతో ప్రజల్లో మార్పు

### లక్షలాది మంది జీవితాలకు మేలు: వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి



మధిర, అక్టోబర్ 29 : కుటుంబ సర్వేతో లక్షలాదిమంది జీవితాల్లో మార్పు వస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ప్రభుత్వం చేపట్టే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. మంగళవారం ఖమ్మం జిల్లా మధిర తహసీల్దార్ కార్యాలయం నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై అన్ని జిల్లాల కలెక్టర్లతో డిప్యూటీ సీఎం భట్టి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే నిర్వహణ విధి విధానాలపై క్యాబినెట్ సమావేశంలో చర్చించి ఆమోదించినట్టు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాల అభ్యున్నతికి, వివిధ సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపర్చడానికి తగిన ప్రణాళికలు రూపొందించేందుకు ఈ సర్వేను ఉపయోగిస్తామని తెలిపారు. నవంబర్ 6 నుంచి సర్వే ప్రారంభించాలని సూచించారు.

## రేవంత్ రికార్డుస్థాయి అప్పులు

- **గత ప్రభుత్వాల నుంచి తెలంగాణకు సంక్రమించిన అప్పు 72,658 కోట్లు**
- **రేవంత్‌రెడ్డి పాలనాపగ్గాలు చేపట్టి 328 రోజుల్లో చేసిన అప్పు 75,118 కోట్లు**
- **ఉమ్మడి పాలకుల కంటే అధిక రుణభారం**

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి సర్కార్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చుతున్నది. అధికారంలోకి వచ్చి ఏడాది నిండకముందే ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు తీసుకున్న రుణాల కంటే అధికంగా అప్పులు చేసింది. 328 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.75,118 కోట్ల అప్పు తెచ్చుకున్నది. రాష్ట్రం ఏర్పడే నాటికి రూ. 72,658 కోట్ల అప్పు తెలంగాణకు గత ప్రభుత్వాల నుంచి సంక్రమించిందని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన శ్వేతపత్రంలో వెల్లడించారు. వారి కంటే అధికంగా ఏడాది కూడా గడవకముందే రేవంత్‌రెడ్డి సర్కారు రూ.2,460 కోట్ల అప్పు అధికంగా చేసింది. ఒక్క ఆర్బీఐ నుంచే ఆగస్టు 13వ తేదీ నాటికి రూ.42,118 కోట్ల అప్పు చేసిన తెలంగాణ సర్కారు.. ఇలా ప్రతి నెలా రూ.5 వేల నుంచి 6 వేల కోట్ల విలువైన బాండ్ల వేలం ద్వారా ప్రభుత్వం అప్పులు తీసుకుంటున్నది. ఇవి కాకుండా వివిధ కార్పొరేషన్లు,స్వయం ప్రతిపత్తి సంస్థలకు ప్రభుత్వం అడ్డగోలుగా గ్యారంటీలు ఇస్తున్నది. అధికారంలోకి వచ్చిన ఎనిమిదిన్నర నెలల్లోనే రూ.25 వేల కోట్ల మేర గ్యారంటీలు ఇచ్చింది. ఈ అప్పులను కార్పొరేషన్లు రెండు విధాలుగా చెల్లిస్తాయి. మొదటిది.. పన్నులు, చార్జీల రూపంలో, రెండోది.. ప్రభుత్వమే ఈ మొత్తాన్ని చెల్లించడం. ఎలా చూసినా ప్రజలకే నష్టమని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు.

### బీఆర్‌ఎస్ కంటే చాలా ఎక్కువ

**నిరుడు** రూ.52,576 కోట్లు అప్పు తీసుకుంటామని నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఈ ఏడాది రేవంత్‌రెడ్డి సర్కారు అప్పు పద్దు కింద రూ.62 వేల కోట్లు చూపించింది. ఈ ఏడాది రూ.62,012 కోట్లు రుణ సమీకరణ చేయనున్నట్టు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. నిరుడుతో పోలిస్తే ఈ ఏడాది రాష్ట్ర అప్పు పద్దు రూ.10 వేల కోట్లు ఎక్కువ. బహిరంగ మార్కెట్‌లో రూ.57,112 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.3,900 కోట్లు, ఇతర రుణాల రూపంలో రూ.1000 కోట్లు సమీకరించనున్నట్టు బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఎలాంటి విప్లవాత్మకమైన ప్రాజెక్టులు, పథకాలు చేపట్టకముందే, కనీసం ఏడాదిపాలన ముగియకముందే రికార్డు స్థాయిలో అప్పులు చేయడంపై ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

## కుల సర్వేనా? కోతల సర్వేనా?

> మొదటిపేజీ తరువాయి...

చేపడుతున్నదని వారు బలంగా వాదిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో చేపట్టిన కులగణనతో పోల్చుతున్నారు. గతంలో ఏపీలో సర్వే నిర్వహించినప్పుడు కేవలం 25 కాలమ్స్‌లో కుల, వ్యక్తిగత, ఆర్థిక స్థితిగతుల వివరాలు సేకరించారు. బీహార్‌లో 17 ప్రశ్నలతో అత్యంత సులభంగా కులగణన చేశారు. కానీ రాష్ట్రంలో మాత్రం ఇందుకు భిన్నంగా సర్వే చేస్తున్నారు. 56 రకాల వివరాలు సేకరిస్తున్నట్టు ఫారంలో స్పష్టం చేస్తున్నా.. అన్ని ప్రశ్నలు కలిపి 70 వరకు ఉన్నట్టు తెలుస్తున్నది.



### సంక్షేమ పథకాలు ఎత్తేసేందుకే?

**ప్రభుత్వం** కులసర్వే పేరు చెప్పి కుటుంబాల ఆస్తిపాస్తుల పూర్తి వివరాలు సేకరించడంపై బీసీ నేతలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ చాలామటుకు కుటుంబాలుగా వేరుగా ఉంటున్నా.. భూములు, ఇండ్లు వంటి స్థిరాస్తులు ఉమ్మడిగా కొనసాగుతున్నాయి. వీటిని ఎవరి ఖాతాలో వేస్తారనేది పెద్ద ప్రశ్న. ఒకే ఇంట్లో అన్నదమ్ములు వేరుపడి రెండు మూడు కుటుంబాలుగా జీవనం కొనసాగిస్తుంటారు. వారందరికీ సొంత ఇల్లు ఉన్నట్టుగా పరిగణిస్తారా? లేక రికార్డుల్లో ఆ ఇంటి యజమాని పేరు మాత్రమే రాసుకొని, మిగతావారిని ఇల్లు లేనివారిగా నమోదు చేస్తారా? అనేది స్పష్టత లేదు. ఒక ఇంట్లో రిజర్వేషన్ల ద్వారా ఎవరైనా ప్రయోజనం పొందితే వారిని ప్రత్యేక కుటుంబంగా పరిగణిస్తారా? లేదా ఇంట్లో ఉన్న అందరూ ప్రయోజనం పొందినట్టు భావిస్తారా? అనేదీ స్పష్టత ఇవ్వలేదు. ఈ సాకుతో వారిని ప్రభుత్వ పథకాలకు దూరం చేస్తారన్న అభిప్రాయాలు మాత్రం వినిపిస్తున్నాయి.

### సంబంధం లేని వివరాల సేకరణ..


తెలంగాణలో సర్వే ఫార్మాట్‌ను రెండు భాగాలుగా విభజించారు. మొదటి భాగంలో (పార్ట్-1) కుటుంబ యజమాని, ఇతర సభ్యుల వ్యక్తిగత వివరాలు నమోదు చేస్తారు. రెండో భాగంలో (పార్ట్-2) కుటుంబ ఆర్థిక, సామాజిక వివరాల ప్రశ్నలు ఉన్నాయి. సర్వేలో కులగణనకు సంబంధంలేని, అవసరం లేని అనేక అంశాలు ఎందుకు చేర్చారనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. స్థిర, చరాస్తుల వివరాలు, ఉద్యోగ, వ్యాపారాల ద్వారా వస్తున్న ఆదాయం, అప్పులు, లబ్ధిపొందిన పథకాలు.. ఇలాంటివన్నీ ఎందుకు అడుగుతున్నారన్న చర్చ నడుస్తున్నది.

- పార్ట్-1లోని 20 నుంచి 30 వరకు గల ప్రశ్నల కాలమ్స్‌లో.. మీరు చేస్తున్న వృత్తి /ఉద్యోగం ఏమిటి? రియల్ ఎస్టేటా? పారిశ్రామికవేత్తనా? అయితే వార్షిక టర్నోవర్ ఎంత? వార్షిక ఆదాయం ఎంత? మీకు బ్యాంకు ఖాతా ఉన్నదా? ఆదాయ పన్ను చెల్లిస్తున్నారా? వంటి వివరాలు సేకరిస్తున్నారు. తద్వారా ఆదాయ పన్ను పరిధిలోకి వచ్చే వారి కుటుంబాలను సంక్షేమ పథకాల నుంచి దూరం చేస్తారనే ఆందోళన ప్రజల్లో నెలకొన్నది.
- 30 నుంచి 40 వరకు గల కాలమ్స్‌లో ధరణి పాస్‌బుక్ కలిగి ఉన్నారా? ఏ రూపంలో భూమి పొందారు..అది పట్టానా? అసైన్డ్ ల్యాండా? అటవీభూమా? తరా..మెట్టనా? నీటిపారుదల వనరు..కౌలుదారు అయితే ఎన్ని ఎకరాలు సాగు చేస్తున్నారు? వంటి కులగణనకు పొంతన లేని వివరాల సేకరణకు నిర్ణయించారు.
- 41, 42, 43, 44, 45 కాలమ్స్‌లో రిజర్వేషన్ ద్వారా పొందిన ప్రయోజనాల వివరాలు సేకరించనున్నారు. విద్య, ఉద్యోగ ప్రయోజనాలు, ఐదేండ్లలో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన మూడు పథకాల వివరాలు నమోదు చేయనున్నారు. వీటిని అడ్డం పెట్టుకొని కొత్త పథకాల నుంచి మినహాయిస్తారా? అని ప్రజలు అనుమానిస్తున్నారు.
- 46, 47లో రాజకీయ నేపథ్యంపై ఆరా తీయనున్నారు. ప్రజాప్రతినిధిగా సభ్యత్వం, పనిచేసిన వివరాలు, ఆఫీస్ బేరర్, మినిస్టర్, చైర్మన్, ఎన్ని టర్మ్‌లు, ప్రజాప్రతినిధిగా చేసిన మొత్తం సంవత్సరాలు, నామినేటెడ్/కార్పొరేషన్/బోర్డు/సహకార సంఘం/ ప్రభుత్వేర సంస్థల్లో సభ్యులుగా పనిచేసిన వివరాలు సేకరించనున్నారు. ఈ వివరాలు ఎందుకు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
- 49వ కాలమ్‌లో (ఏ) గత ఐదేండ్లలో తీసుకున్న రుణ వివరాలు, ఎప్పుడు, ఎందుకు తీసుకున్నారో అడగనున్నారు. ప్రభుత్వ రుణాలకు మాత్రమే వర్తిస్తుందా? ప్రైవేట్ రుణాలూ పరిగణనలోకి తీసుకుంటారా? అనే స్పష్టత ఇవ్వలేదు.
- ఇక 51వ కాలమ్‌లో ఆవులు, ఎడ్లు, గొర్రెలు, బర్రెలు, మేకలు, కోళ్లు, బాతులు, పందులు వంటి పశుసంపద వివరాలు నమోదు చేసుకోనున్నారు. ఈ వివరాలు ఎందుకు అడుగుతున్నారన్నది అర్థంకాని ప్రశ్నలా మిగిలింది.
- 52వ కాలమ్‌లో స్థిరాస్తి వివరాలు, 53లో చరాస్తి వివరాలు (వాహనాలు) సేకరిస్తుండగా, 55లో ఇల్లు విస్తీర్ణం, వసతులు వంటివి అడుగుతున్నారు. ఇందులో ఇంట్లోని గదుల సంఖ్య వంటివి ఎందుకు అడుగుతున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవేళ ఏదైనా కొత్తగా ఏర్పడిన కుటుంబం ఇందిరమ్మ ఇంటికోసం దరఖాస్తు చేసుకుంటే ఉమ్మడి ఆస్తిని సాకుగా చూపుతారనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

### 60 రోజుల్లో పూర్తిచేయడం సాధ్యమేనా?

సర్వేలోని సంక్లిష్టతలను చూస్తుంటే ప్రభుత్వం నిర్దేశించిన 60 రోజుల్లో కులగణన చేపట్టం ఎంతవరకు సాధ్యమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లినప్పుడు సరైన వివరాలు ఎంత మంది ఇస్తారన్నది ఒక ప్రశ్న. వారు ఇచ్చిన వివరాలు నిర్ధారించుకునేందుకు సంబంధిత పత్రాలను ఇచ్చేందుకు ఎంత మంది సుముఖంగా ఉంటారనేది మరో ప్రశ్న. సర్వేలో అడుగుతున్న వివరాలను బట్టి ప్రజల నుంచి వ్యతిరేకత ఎదురయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని అధికారులు చెప్తున్నారు. ప్రతి కుటుంబానికి సంబంధించి క్షుణ్ణంగా వివరాలు సేకరించడం కత్తిమీద సామేనని అభిప్రాయపడుతున్నారు. ఈ పరిణామాలు అంతిమంగా స్థానిక ఎన్నికల వాయిదాకు దారితీసే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

### లోకం పోకడ




## బీఆర్‌ఎస్ కార్యకర్తపై పోలీసుల దాడి!

**ఆపై తహసీల్దార్ ఎదుట బైండోవర్**
**సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాడని.. మహబూబ్‌నగర్ పోలీసుల నిర్వాకం**

మహబూబ్‌నగర్, అక్టోబర్ 29 : సోషల్ మీడియాలో బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా పోస్టులు పెడుతున్నాడని ఆ పార్టీ కార్యకర్తను మహబూబ్‌నగర్ పోలీసులు బైండోవర్ చేసి చితకబాదారు. బాధితుడి కథనం మేరకు..మహబూబ్‌నగర్ వన్‌టౌన్ ప్రాంతంలో నివసించే వరద భాస్కర్ ముదిరాజ్ బీఆర్‌ఎస్ సోషల్ మీడియా వారియర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో అతడు ఇంట్లో ఉన్న సమయంలో పోలీసులు ఇంటికి వచ్చి స్టేషన్‌కు రావాలని ఒత్తిడి చేశారు. 'ఈ రోజు ఉపవాసం ఉన్నా.. పూజ చేశాక వస్తా అని చెప్పినా.. పోలీసులు వినలేదు. 'ఏం తప్పు చేశాడని స్టేషన్‌కు రమ్మంటున్నారు' అని కుటుంబసభ్యులు అడిగినా వినలేదు. దీంతో ఆ వ్యక్తి స్టేషన్‌కు వెళ్లగానే సోషల్‌మీడియాలో పోస్టులు ఎందుకు పెడుతున్నావని సీఐ అప్పయ్య టైర్ బెల్టుతో చితకబాదారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, హరీశ్‌రావు స్టేషన్‌కు వస్తున్నారనే సమాచారం రావడంతో ఆగమేఘాల మీద అతడిని అర్బన్ తహసీల్దార్ ఎదుట హాజరుపర్చి వదిలిపెట్టారు. మరోసారి సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించినట్టు బాధితుడు వాపోయాడు. ఈ విషయమై సీఐ అప్పయ్యను ప్రశ్నిస్తే ఫిర్యాదు రావడంతోనే భాస్కర్‌ను బైండోవర్ చేసినట్టు తెలిపారు. డీఎస్పీ వెంకటేశ్వర్లును వివరణ కోరగా వాట్సాప్‌లో పోస్టులు పెట్టినందుకే భాస్కర్‌ను బైండోవర్ చేశామని, అతడిపై దాడి చేయలేదని పేర్కొన్నారు.

## ఏసీబీకి ఫార్ములా ఈ-కార్ల కేసు

**55 కోట్లు అక్రమ లావాదేవీలు జరిగాయని ఆరోపణ**
**ఏసీబీకి పురపాలకశాఖ ఫిర్యాదు**

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : ఫార్ములా ఈ-రేస్ కార్ల కేసును ప్రభుత్వం మళ్లీ తెరపైకి తెచ్చింది. 55 కోట్ల అక్రమాలు జరిగాయని మున్సిపల్‌శాఖ అధికారులు మంగళవారం ఏసీబీకి ఫిర్యాదు చేశారు. నిబంధనలు పాటించకుండా ఎంఏయూడీ నిర్వహణ సంస్థ ఎఫ్‌ఈవోకు రూ.55 కోట్ల చెల్లింపులు చేసినట్టు పేర్కొన్నది. ఒప్పందంలో పేర్కొన్న అంశాలు పాటించకపోవడంతో ఫార్ములా ఈ రేసింగ్ సెషన్-10 రద్దు అయ్యిందని, బోర్డు, ఆర్థికశాఖ నుంచి ముందస్తు అనుమతి లేకుండానే రూ.55 కోట్లు విదేశీ సంస్థకు నిధుల చెల్లింపులు జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నట్టు సమాచారం. గత ఏడాది ఫిబ్రవరి-11న హైదరాబాద్‌లో హుస్సేన్‌సాగర్ చుట్టూ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన 2.8 కి.మీ. ట్రాక్‌లో మొదటి ఫార్ములా ఈ-కార్ల పోటీ జరిగింది.సీజన్-9 ఫార్ములా ఈ-రేస్ నిర్వహణకు రూ.200 కోట్లు ఖర్చయింది. ఇందులో ఈవెంట్ నిర్వాహక సంస్థ లైన గ్రీన్ కో రూ.150 కోట్లు, హైదరాబాద్ రేసింగ్ లిమిటెడ్ రూ.30 కోట్లు ఖర్చుచేశాయి. రహదారులు, ఇతర మౌలిక వసతులకు హెచ్‌ఎండీఏ రూ.20 కోట్లు ఖర్చు చేసింది. ఇది విజయవంతం కావడంతో 2024 ఫిబ్రవరి 10న మరోసారి (సెషన్-10) నిర్వహించేందుకు ఫార్ములా ఈ-రేస్ ఆపరేషన్ (ఎఫ్‌ఈవో)తో ఎంఏయూడీ 2023 అక్టోబర్‌లో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు హెచ్‌ఎండీఏ రూ.55 కోట్లు ఎఫ్‌ఈవోకు చెల్లించింది. ఈ వ్యవహారానికి సంబంధించి సీనియర్ ఐఏఎస్ ఒకరు సొంత నిర్ణయాలు తీసుకున్నారని, ప్రభుత్వ పెద్దలకు తెలియకుండా, ఎన్నికల సంఘం అనుమతి తీసుకోకుండా, కనీసం ఆర్థికశాఖ దృష్టికి తీసుకెళ్లకుండానే ఆ ఈవెంట్ నిర్వహణకు హెచ్‌ఎండీఏ నుంచి రూ.55 కోట్లు ముందస్తు చెల్లింపులు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిసింది. దీనిపై కేసు స్వీకరించేందుకు అనుమతి కోరుతూ ప్రభుత్వానికి ఏసీబీ లేఖ రాసింది.

## బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ మైండ్‌గేమ్

**టైమర్ ఆన్.. 36 గంటల్లో ఆటంబాంబ్..**
**సోషల్ మీడియాలో మంత్రి అనుచరుల హల్‌చల్**

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ ప్రజల దృష్టిని మరల్చేందుకు మైండ్‌గేమ్‌కు తెరతీసినట్టు తెలుస్తున్నది. ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి 'దీపావళికి బాంబు పేలుతుంది' అంటూ వ్యాఖ్యానించారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మూడు గంటలకు పైగా చర్చలు జరిపారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిదికి చెందిన జన్వాడ ఇంట్లో జరిగిన వేడుకలపై తాము వేసిన పాచిక పారకపోవడంపై తర్జనభర్జన పడినట్టు తెలిసింది. జన్వాడ ఇంటిపైకి ఎక్సైజ్ సిబ్బంది కాకుండా లా అండ్ ఆర్డర్ పోలీసులను పంపి ఉంటే బాగుండేదని భావించినట్టు సమాచారం. తాజాగా మరో మైండ్‌గేమ్‌లో భాగంగానే 'టైమర్ ఆన్.. 36 గంటల్లోగా పేలనున్న ఆటం బాంబులు' అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అనుచరులు, వారి సోషల్‌మీడియా మొత్తం మంగళవారం హల్‌చల్ చేయడం మొదలుపెట్టింది. వారు ఆ క్యాంపెయిన్ ప్రారంభించిన కొద్ది గంటల్లోనే ఫార్ములా ఈ-రేస్ కేసుకు సంబంధించి ఏసీబీకి మున్సిపల్‌శాఖ అధికారులు ఫిర్యాదు చేశారని మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఇవన్నీ బీఆర్‌ఎస్ నేతలను టార్గెట్ చేస్తూ అధికారపక్షం పన్నుతున్న కుయుక్తులని విశ్లేషకులు భావిస్తున్నారు.